క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం సీతారావమ్మ

సంజామల: మండలంలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఖోఖోలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సీతారావమ్మ తెలిపారు. అండర్–14లో రుక్సాన, అండర్–17 విభాగంలో హర్షిత ఈ నెల 22వ తేదీ జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం విద్యార్థినులు, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను హెచ్‌ఎం అభినందించారు.

కొలిమిగుండ్లకు ట్రాక్టర్ మంజూరు



కొత్త ట్రాక్టర్‌తో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

కొలిమిగుండ్ల: స్థానిక గ్రామ పంచాయతీకి కొత్త ట్రాక్టర్ మంజూరైంది. బుధవారం కోవెలకుంట్లలోని షోరూం నుంచి సర్పంచ్ శివరాముడు, పంచాయితీ కార్యదర్శి భాస్కర్‌రావు డెలివరీ తీసుకున్నారు. గ్రామంలో చెత్త సేకరణకు ట్రాక్టర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. వీటని దృష్టిలో ఉంచుకుని ఏడాది క్రితం పంచాయితీ కార్యదర్శి భాస్కర్ రావు ట్రాక్టర్ మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఎట్టకేలకు ట్రాక్టర్ మంజూరైంది. కోవెలకుంట్లలోని ఫర్గూషన్ షోరూంలో పూజలు అనంతరం ట్రాక్టర్‌ను కొలిమిగుండ్లకు తీసుకొచ్చారు. గ్రామ పంచాయితీ నిధులతో ట్రాలీని కొనుగోలు చేసి చెత్త సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతామని సర్పంచ్ తెలిపారు.

ఘనంగా సీఎస్ఐ చర్చి వార్షికోత్సవం



ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

డోన్: స్థానిక పాతబస్టాండ్‌లోని సీఎస్ఐ చర్చి 9వ వార్షికోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సంఘ కాపరి రెవరెండ్ సామ్యూల్ మాట్లాడుతూ.. 1912 నాటి చర్చిని అవసరాల మేరకు తొమ్మిదేళ్ల క్రితం అధునాతన వసతులతో పునర్నించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో జీవించాలని హితవుపలికారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మరియదాస్, కోశాధికారి విజయరాణి, సభ్యులు జాన్‌ప్రభాకర్, పాల్, వేదరత్నకుమారి పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



టంగుటూరులో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బనగానపల్లె రూరల్: గ్రామ సచివాలయ సిబ్బంది పనివేళల్లో తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని కైప, టంగుటూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజు ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకోవాలని, వివిధ సమస్యలపై వచ్చే ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. బయటకు వెళ్లాల్సి వస్తే మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల పసుపల గ్రామ సచివాలయంలో ఏడుగురు ఉద్యోగులకు మెమో జారీ చేశామని గుర్తు చేశారు.

మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత



మొక్క నాటుతున్న బ్యాంకు మేనేజర్

బనగానపల్లె రూరల్: మొక్కలు నాటి వాటిని సంరక్షించడం సామాజిక బాధ్యత అని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) గార్లదిన్నె శాఖ మేనేజర్ మహబూబ్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని పసుపల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం రవీంద్ర, విద్యార్థులతో కలిసి పలు మొక్కలు నాటారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే మొక్కలను పెంచి సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్ల వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతమ్మ, యమునబాయి, మద్దిలేటి పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- ఎస్సార్బీసీ పదో బ్లాక్ కాల్వకు గండి
- కాల్వలపై కొరవడిన పర్యవేక్షణ
- కంపచెట్లు, పూడికతో నిండిపోయిన కాల్వలు
- పంటపొలాలు నీట మునిగి నష్టపోయిన రైతులు



ఎస్సార్బీసీ పదో బ్లాక్ కాల్వకు గండి పడి పంట పొలాల్లోకి చేరిన నీరు

కోవెలకుంట్ల: ఎస్సార్బీసీ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ఆ శాఖ అధికారులు, లష్కర్లు కాల్వలను పర్యవేక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే బుధవారం కోవెలకుంట్ల సమీపంలో ఎస్సార్బీసీ పదో బ్లాక్ కాల్వకు భారీగా గండి పడింది. కోవెలకుంట్ల ఎస్సార్బీసీ పరిధిలో ఏడో బ్లాక్ నుంచి 13వ బ్లాక్ కాల్వల ద్వారా కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, అవుకు మండలాల్లో దాదాపు 94 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఏటా జులై నెలాఖరు నుంచి మరుసటి ఏడాది ఫిబ్రవరి వరకు శ్రీశైలం జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. మార్చి నెల నుంచి జులై నెల వరకు కాల్వల్లో నీరు ఉండదు. నీరు ప్రవహిస్తున్న కాల్వలను ఎస్సార్బీసీ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. వేసవికాలంలో కాల్వల్లో పూడికతీత, కాల్వగట్ల వెంట ఉన్న కంపచెట్ల తొలగింపు, కాల్వ మరమ్మతులు, కాల్వగట్ల పటిష్టతపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ అధికారులు కాల్వలపై నిర్లక్ష్యం చేయడం వల్లనే కాల్వలకు గండ్లు పడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వలకు గండ్లు పడి ఏటా ఏదో ఒక చోట పంట పొలాలు నీట మునిగి రైతులకు నష్టం చేకూరుతోంది. తుపాన్ ప్రభావంతో వారం రోజుల నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మిరప, పత్తి, జొన్న, పొగాకు, తదితర పంటలకు సాగునీరు మళ్లించుకోవాల్సిన అవసరం లేదు. ఇదే తరుణంలో ఎస్సార్బీసీ అధికారులు రెండు రోజుల క్రితం పదో బ్లాక్ కాల్వకు భారీగా నీటిని విడుదల చేశారు. నీటి ఉధృతికి కోవెలకుంట్ల– గుంజలపాడు గ్రామాల మధ్య ఉన్న కాల్వకు గండి పడింది. కాల్వ కట్ట బలహీనంగా ఉండడంతో కట్ట కోతకు గురై నీరంతా పక్కనే ఉన్న పంట పొలాల్లో చేరింది. కోవెలకుంట్ల, గుంజలపాడు గ్రామాలకు చెందిన రైతులు కాల్వ పరివాహంలో జొన్న పంట సాగు చేయగా నీట మునిగి నష్టం వాటిల్లింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో పప్పుశనగ సాగుకు రైతులు ఇటీవల పొలాల్లో రసాయన మందు వేసుకుని విత్తనానికి సిద్ధంగా ఉన్న తరుణంగా కాల్వకు గండి పడి నీరంతా పొలాల్లో చేరడంతో రసాయన ఎరువులు నీటి పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ నీరు పొలాల్లో భారీగా ప్రవహిస్తుండడంతో ఇప్పట్లో విత్తనం వేసుకునేందుకు అస్కారం లేక అదును దాటుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన గండి పూడ్చి పొలాల్లోకి నీరు చేరకుండా, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి

డోన్ టౌన్: తప్పులను తెలుసుకుని సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా లీగల్ సర్వీసు అథారిటీ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. బుధవారం డోన్ సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. జైలు పరిసరాలను పరిశీలించారు. భోజన, వసతి, వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో సమావేశమై జైలులోని పరిస్థితులపై ఆరా తీశారు. ఖైదీల వారిగా వివరాలు అడుగుతూ రికార్డులను సరిచూశారు. జైలు జీవితం గడపడానికి కారణాలు తెలుసుకున్నారు. చేసిన తప్పులను తెలుసుకుని ఇకనైనా మంచిగా జీవించాలని సూచించారు. బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి స్వతహాగా న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్థోమత లేని వారికి ప్రభుత్వం తరుపున ఉచితంగా న్యాయవాదిని నియమించి న్యాయసేవలు అందిస్తామని తెలిపారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, లీగల్ అడ్వయిజర్ మధు ఉన్నారు.

అద్దె తగ్గించి.. అడ్డంకులు తొలగించండి



మున్సిపల్ చైర్మన్ రాజేష్‌ను కలిసిన వ్యాపారులు

డోన్: కూరగాయల మార్కెట్‌లో దుకాణాల అద్దెను తగ్గించడంతో పాటు దుకాణాలకు అడ్డంగా పెట్టిన కూరగాయల అంగళ్లను తొలగించాలని వ్యాపారులు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌ను కోరారు. బుధవారం ఆయన చాంబర్‌లో వ్యాపారులు కలిసి సమస్యలను తెలియజేశారు. ఆధునిక కూరగాయల మార్కెట్ బయట ఉన్న దుకాణాలకు రూ.18,500 కొలతల ప్రకారం అద్దె వసూలు చేస్తున్నారని, అయితే మార్కెట్ లోపల షాపులకు రూ.5వేలు అద్దె నిర్ణయించాల్సి ఉండగా, నెలకు రూ.12 వేలు వసూలు చేయడం దారుణమన్నారు. ఈ వ్యత్యాసాన్ని పరిశీలించి సరిచేయడంతో పాటు తమ దుకాణాలకు ఎదురుగా ఉన్న కూరగాయల అంగళ్లను తొలగించాలని చైర్మన్‌ను కోరారు. చైర్మన్‌ను కలిసిన వారిలో వ్యాపారులతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్ ఆర్ట్ రమణ, మాజీ కౌన్సిలర్ మేకల రాజు ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆత్మబంధువు సభ్యులు

డోన్: మండల పరిధిలోని మల్యాల–లింగనేనిదొడ్డి గ్రామాల మధ్య రైలు నుంచి కిందపడి మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తికి ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు బుధవారం హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. రైల్వే ట్రాక్ పక్కనున్న పొలాల్లో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం ఉన్నట్లు స్థానిక రైతులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. డోన్ రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అంత్యక్రియల కోసం ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రొద్దుటూరుకు చెందిన నారాయణరెడ్డి, చరణ్‌తేజ్ రెడ్డి ఆర్థిక సహాయంతో సేవా సమితి సభ్యులు షాఢిఖాన రాజు, పానిపూరి మురళి, తాహెర్‌బాషా, కానిస్టేబుళ్లు మధు, సుధాకర్, నరసింహ అంత్యక్రియలు పూర్తి చేశారు.

వణికిస్తున్న విష జ్వరాలు

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు

కోవెలకుంట్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో వైరల్ జ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి. నాలుగు రోజుల నుంచి కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీనగర్, సంతపేట, ఎల్‌ఎం కాంపౌండ్, స్వామినగర్, సాయినగర్, తదితర కాలనీల్లో చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు దగ్గు, జలుబు, జ్వరం, ఒళ్లునొప్పులు తదితర రోగాలతో బాధపడుతున్నారు. జ్వర పీడితులు చికిత్స నిమిత్తం పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌తోపాటు పలు ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూకట్టారు. అలాగే మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వర్షాల కారణంగా ప్రజలు విష జ్వరాలతో చికిత్స చేయించుకుంటున్నారు. సంబంధిత వైద్యాధికారులు ఆయా కాలనీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న సీఐ

ప్యాపిలి: విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ మధుసూదన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఇంటర్ విద్య చాలా కీలకమైందన్నారు. ఈ దశలో సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయడం, ఈవ్ టీజింగ్‌కు పాల్పడడం, దురలవాట్ల బారిన పడటం ప్రమాదకరం అన్నారు. సరైన ప్రణాళిక రూపొందించుకుని ఆ మేరకు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీనపాటి, అధ్యాపకులు రామకృష్ణయ్య, నవీన్, సత్యబాబు, ఓబులేసు, వెంకటరమణ, మద్దిలేటి, ముస్తాక్, వెంకటేశ్వర్లు, శంకరయ్య పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలతో విజ్ఞానం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: క్షేత్ర పర్యటనల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని హెచ్‌ఎం పద్మావతి అన్నారు. బుధవారం పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో వృత్తి విద్యా కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా పట్టణంలోని శ్రీసాయినాథ్ ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శింపజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, అల్లిపీరా మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరం అన్నారు. కనీస పరిజ్ఞానం అయిన ఎంఎస్ ఆఫీసు, గుగూల్ సెర్చ్, ఇంటర్నెట్ వినియోగం తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, లక్ష్మీకాంతరెడ్డి, మునిరాజు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



బనగానపల్లె: బీరవోలులో మాట్లాడుతున్న సర్వేయర్

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామంలో నిర్వహించిన భూరీసర్వే గ్రామసభలో రైతుల నుంచి 26 దరఖాస్తులు అందినట్లు సర్వేయర్ వీరన్న తెలిపారు. పొలాల విస్తీర్ణానికి సంబంధించి రికార్డుల్లో తేడాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూసమస్యలపై రైతులు దరఖాస్తులు అందజేశారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్వేయర్ పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వీఆర్‌ఓ, రైతులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్: మండలంలోని బీరవోలు గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో భూసర్వే సమస్యలపై 18 వినతులు వచ్చినట్లు మండల సర్వేయర్ గీతాగాయత్రి, ఆర్ఐ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సంజామల: మండల పరిధిలోని ఎగ్గోని గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ తులసి కృష్ణ మాట్లడుతూ రీసర్వేలో రైతులకు ఎదురైన సమస్యలను గ్రామ సభల ద్వారా తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సర్పంచ్ అసద్ అలీఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి, మండల సర్వేయర్ నాగరాజు నాయక్ రైతుల నుంచి 132 దరఖాస్తులను స్వీకరించారు. ఆన్‌లైన్, భూ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రామ చంద్రారెడ్డి పాల్గొన్నారు. అంబాపురం గ్రామంలో జరిగిన గ్రామసభలో రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి రామ్ మోహన్ రైతులతో కలిసి అధికారులకు వినతి పత్రం అందజేశారు.

డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తబురుజులో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. రైతులు భూసమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. వీఆర్వో గోవింద్, మండల సర్వేయర్ జగదీష్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

మాజీ మంత్రి బుగ్గన డోన్‌కు రాక

డోన్: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం డోన్‌లోని తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో భవిష్యత్ కార్యక్రమాలపై చర్చిస్తారని పేర్కొన్నారు.

ఆకుమల్లలో ఆధార్ క్యాంప్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో గురువారం ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మాన్ తెలిపారు. గ్రామ సచివాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బత్తులూరుపాడులో గ్రామసభ

బనగానపల్లె: మండలంలోని బత్తులూరుపాడు గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. రీసర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: యు.కొత్తపల్లె సబ్ స్టేషన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫీడర్ పరిధిలో రోడ్డు పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, చిగురమానుపేట, కొండపేట, దొరపల్లె ఫ్యాక్టరీలకు గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

చంద్రపల్లిలో..

ప్యాపిలి: హుసేనాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా గురువారం చంద్రపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్యాపిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. మూడు నెలల కాలంలో ఆయా శాఖల పరిధిలో జరిగిన పనులకు సంబంధించిన సమగ్ర నివేదికతో అధికారులు సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జీవాల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

అవుకు: జీవాల సంరక్షణకు గొర్రెల పెంపకందారులు తగు జాగ్రత్తలు పాటించాలని ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డీవీ రమణయ్య అన్నారు. బుధవారం అవుకులో నట్టల నివారణ మందు కార్యక్రమాన్ని బనగానపల్లె పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు మారుతీ, అవుకు పశువైద్యులు భారతీదేవితో కలిసి పరిశీలించారు. జీవాల పెంపకంలో సరైన జాగ్రత్తలు పాటిస్తే అత్యధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. గొర్రెలు, మేకల్లో నట్టల వ్యాధి సర్వ సాధారణంగానే వస్తుందన్నారు. మట్టితో కలిసి ఉన్న గడ్డిని తినడం వల్ల జీవాల్లోకి నట్టలు చేరుతాయని, సకాలంలో నట్టల నివారణ మందును తాగిపిస్తే వాటి కడుపులో ఉన్న నట్టలు చనిపోయి పూర్తి ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. మండలంలో దాదాపు 85 వేల జీవాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, పశువైద్యుల సలహాలు పాటించాలని సూచించారు.

మిరపలో సస్యరక్షణతో లాభసాటి దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త బాలరాజు

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప వివిధ దశల్లో ఉందని, సరైన సస్య రక్షణ చేపడితే లాభసాటి దిగుబడులు సాధించవచ్చని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త బాలరాజు సూచించారు. బుధవారం మండలంలోని రేవనూరు గ్రామంలో మిరప రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల మధ్య అంతరం పాటించాలని, ఎకరాకు 40 చొప్పున పసుపు, నీలం, తెలుపు రంగు అట్టలు అమర్చుకోవాలని పేర్కొన్నారు. అధిక వర్షాల వల్ల మిరప పొలంలో నీరు నిలబడకుండా బయటకు పంపాలని తెలిపారు. 10 లీటర్ల నీటికి 2.5 ఎంఎల్ సీఓసీ, రెండు ఎంఎల్ స్ట్రెప్టో సైక్లిన్ మందు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి, సిబ్బంది రాజేష్, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో తనిఖీ



బస్టాండ్‌లో ప్రయాణికుల వసతులపై ఆరా తీస్తున్న ఆర్‌ఎం

కోవెలకుంట్ల: ఆర్టీసీ బస్సులు సమయానికి ఆయా రూట్లలో నడిచేలా చూడాలని రీజినల్ మేనేజర్ రజియా సుల్తానా సిబ్బందికి సూచించారు. బుధవారం కోవెలకుంట్ల ఆర్టీసీ డిపోను ఆమె తనిఖీ చేశారు. డిపో గ్యారేజీలో బస్సుల మెయింటెనెన్స్ పనులు పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అందరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని ఆయా డిపోలు నష్టాలబారిన పడకుండా ప్రణాళికలు రూపొందించి అందుకనుగుణంగా ఆయా రూట్లలో బస్సులు నడుపుతున్నామని తెలిపారు. కోవెలకుంట్ల బస్టాండ్‌లోకి వెళ్లివచ్చే మార్గంలో అధ్వానంగా మారిందని, త్వరలో కొత్త సీసీరోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆమె వెంట డిపో మేనేజర్ తిరుపతయ్య, ఎస్టీఐ కిషోర్, నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా నాయకుడు శివరాం, తదితరులు ఉన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



ప్రసాద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కాటసాని రామిరెడ్డి

కొలిమిగుండ్ల: మదనంతపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుద్దాల ప్రసాద్ 20 రోజుల క్రితం అనారోగ్యంతో ప్రసాద్ మృతి చెందాడు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామానికి వెళ్లి ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి చంద్రశేఖర్‌రెడ్డి, పేరం సత్యనారాయణ రెడ్డి, నారాయణరెడ్డి, ఓబులేసు, సంజీవకుమార్ రెడ్డి, రామేశ్వరరెడ్డి, రామాంజనేయులు, మహేశ్వర రెడ్డి ఉన్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు



సామాజిక తనిఖీ ప్రజా వేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

బేతంచెర్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా జరిగేందుకు ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని డ్వామా పీడీ జనార్ధన్ రావు, ఏపీడీ బాలజీ నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. మండలంలో ఈనెల 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగిన పనులపై ఎస్టీఎం లోకేశ్వర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ మురాద్, సామాజిక తనిఖీ బృందం సభ్యులు సాజాజిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ, ఏపీడీ మాట్లాడారు. మండలంలో ఏప్రిల్ 2023 నుంచి 2024 మార్చి వరకు జరిగిన 1080 పనులకు రూ.12,45,19,295 ఖర్చు చేశారన్నారు. ఇందులో 19 గ్రామ పంచాయతీల్లో రూ.6,59,655 రికవరీ, రూ.43,500 పెనాల్టీ కట్టాలని ఆదేశించారు. అక్రమాలకు తావులేకుండా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, అంబుడ్స్‌మెన్ సురేంద్ర కుమార్, ఏపీఓ శేషన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

బనగానపల్లె రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్ట్రక్షన్ ప్రాజెక్టు కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రమోద్‌జోషి అన్నారు. బుధవారం స్థానిక కంకర గుర్రెడ్డి జూనియర్, డిగ్రీ కళాశాలలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు, భద్రతపై సెమినార్ ఏర్పాటు చేశారు. ఇందులో ఆయన జోషి మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, అతివేగంగా వెళ్లారాదని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శ్రీకాంత్‌బాల్, కళాశాల ప్రిన్సిపాల్ సదాశివమూర్తి పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామంలో మద్యం విక్రయిస్తున్న జాగటి వెంకరమణను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. అతని వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.